*ఖనిజాల కోసం, రిజర్వాయర్ల కోసం, కంపెనీల కోసం, రిసార్టుల కోసం, ఎమ్యూజ్‌మెంట్ పార్కుల కోసం , విహార యాత్రాస్థలాల కోసం ఆదివాసీల అడవినీ, కొండనీ, భూమినీ ఇపుడు ప్రభుత్వాలు అభివృద్ధి విధానాల పేరిట తీసుకుంటున్నాయి. యాభయ్యేళ్ల కిందట ఆదివాసీలు పోరాటబాటలో నడచినప్పడు ఇవే ప్రభుత్వాలు- భూపంపిణీ, రకరకాల సంక్షేమ పథకాల పంపిణీ విధానాల నమలుచేసాయి. ప్రభుత్వ విధానాలలో మార్పు యెందుకొచ్చింది... ఫలితంగా ఆదివాసీ  జీవితాల్లో యే మార్పులొచ్చాయో చూపడానికి ప్రయత్నం చేసిన కథ!*

అట్టాడ అప్పల్నాయుడు

# 10 చిటికెన వేలు





అది చీమలు దూరని చిట్టడివి! అది కాకులు దూరని కారడివి!! ఆ అడివిలోకి కార్పొరేటు కంపెనీ దూరింది!!! పెరటి పెండి అవతల గింజలేరుతున్న కోళ్లను తినమరిగిన నక్కలా పరుగులు తీస్తంది కంపెనీ వాహనం! నక్కల అలికిడికి బెదిరిన కోళ్లు రెక్కలు కొట్టుకొని యెగిరేట్లు... సోమన్నగూడ సవరలు వాహనం అలికిడయితే బెదిరిపోయే వోళ్లు యింతక మునుపు! గానీ యిపుడు కొందరు వాహనం కోసం యెదురు చూస్తునారు. సోమన్నదొరే యెదురు చూట్టమూ లేదు, బెదిరిపోయి పారిపోవడమూ లేదు. మునివాకిటి నులక మంచమ్మీద కూచున్నాడు. అప్పటికి పొద్దు మలిగిపోయే వేళ కావస్తోంది! కొండలమీంచి సూరీడు ఆఖరి చూపు చూస్తున్నాడు!

గూడ మొగదలకు వాహనమొచ్చింది!

సోమన్నగూడ రామంపేటకి ఆరేడు కిలోమీటర్ల దూరంలో వుంది. ఉత్తర, దక్షిణాల్లో యెత్తయిన పర్వతాలు, వాటి కిందుగా దట్ట మయిన అడివీ, అడివిని ఆనించి గూడ! గూడకి అర కిలోమీటరు దూరాన పర్వతాల మధ్యలోంచి నిత్యం ప్రవహించే గెడ్డ! ఆ గెడ్డ నీటిలో పులులు, సింహాలు, దుప్పులు, దుమ్మలగొండ్లు, ఏదుపందులు, అడివి పందులు అడివిలోని సకల జీవరాశీ జలకాలాడేవి, దాహార్తిని తీర్చు కొనేవి... సోమన్నగూడ సవరల్తో పాటూ! నిత్యం ప్రవహించటంతో సవరలు దాన్ని ఊట గెడ్డ అనీవోరు!

ఒకనాడు ఊటగెడ్డ కాదు- ఎస్.జి. ఫాల్స్ అన్నారు పీవోగారు!

సోమన్నగూడను ఎస్.జి. అనీ, గెడ్డను... ఫాల్స్ అనీ ఆంగ్ల నామ కరణం చేస్తూ పులకించి పోయేరు పీవోగారు. చాలాసేపు గెడ్డ దగ్గర నిల్చొని మీదకి పర్వతాల వేపు చూసేరు. రెండు పర్వతాలూ ఎత్తుగా, పచ్చగా తలెత్తుకు నిల్చున్న ప్రకృతి పురుషుల్లా కన్పించేయి. అప్పటి కప్పుడు... సెల్‌లో ఫోటోలు దీసి, వాటికింద- కవితాత్మక కేప్షన్ రాసి, మళ్లీ మళ్లీ చదివి, వెంటనే ఫేస్ బుక్‌లో పోస్ట్ చేశారు. ఆయన ఫేస్ బుక్‌లో అప్టుడేగా వుంటాడు, ఆఫీస్ పనుల కంటే!

“ఏటో? మాకు నోరు తిరగదు మళ్ల,” ఆంగ్ల నామానికి అభ్యంతరం చెప్పేడు మంగన్న. ఔ... మళ్ల... అన్నట్టుగా తలలాడించేరు మిగిలినోళ్లు!

“మీ దశ తిరుగుతుంది. పేరు మారాలయ్యా, మీరూ మారాలి,” అనన్నారు పీవోగారు.

అయిదో తరగతి చదివి మానేసినోళ్లు మంగన్నకు మద్దతుగా తలలూపేరుగానీ, హైస్కూల్‌కి వెళ్లి పదో తరగతి పాసయినోళ్లూ, పోయినోళ్లూ... పీవోగారికి మద్దతుగా తలలూపేరు. మంగన్న తరం సవరలకు మంగన్నలాగే అక్షరశుద్ధి లేదు. మంగన్న మాటే తమ మాటన్నట్టు నిలబడ్డారు.

సోమన్న మౌనంగా విభజనయిన తన వాళ్లవేపు చూస్తూ ఆలోచనలో పడినాడు.

ఈ గూడను యిపుడు సోమన్నగూడని పిలస్తన్నారు గానీ ‘ఇటిక గూడ’ అని గవర్నమెంటు రికార్డుల్లో వుండేది! ఇటిక అన్నది ఒక జమీ! ఆ ఇటిక జమీందారు యీ గూడనీ, చుట్టుపక్కల గూడేల్నీ నానా హింసలు పెట్టేవాడు. కొండ పంటల్ని, అడివి దినుసుల్ని సవరల చేత జమీకి మోయించుకు పోయేవాడు. సవరలకు తిండికి గింజలు లేకుండా దోచేవాడు. సవర స్త్రీలను కోటకు పట్టుకుపోయి అందమయిన వాళ్లను అనుభవించేవాడు, పాలెగత్తెలుగా కోటలో వుంచుకునేవాడు.

ఈ గూడకి చెందిన మల్లయ్య చుట్టుపక్కల గూడేలను కూడగట్టేడు. ఆయుధాలు సమకూర్చుకున్నారు. తిరుగుబాటు చేసేరు.

జమీందారు ఆంగ్లేయుల సైన్య సహకారంతో తిరుగుబాటుని అణచేశాడు. మల్లయ్యకు మరణశిక్ష విధించేరు. ఇటిక జమీందారు మీద తిరుగుబాటు కారణాన యీ గూడను ఇటీకగూడ అని గవర్నమెంటు రికార్డుల్లో రాసేరు! ఆ ఇటిక గూడ తర్వాత సోమన్న గూడ అయ్యింది!

సోమన్న గూడ ఔను... సోమన్న తన పేరే...? ఇదెవుళు పెట్టేరు??

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.

ఇటికగూడకు రెవిన్యూ డిపార్టుమెంటొచ్చింది.

ఫారెస్ట్ డిపార్టుమెంటొచ్చింది. రక్షకభట శాఖ వచ్చింది.

అడివి మీదా, భూమి మీదా, మనుషుల మీదా డిపార్టుమెంట్లకి అధికారముందన్నాయి! వారితోనే షావుకారి వచ్చేడు. ఉప్పు, కిరసనాయిలూ, నూలు బట్ట, పల్లపు తినుబండారాలూ తెచ్చేడు. పల్లం వ్యాపారం తెచ్చేడు. సొండోడొచ్చేడు... ఇప్పసారా తెచ్చేడు.

అడ్డడు ఉప్పు అరువిచ్చి పడ్డపెయ్యలను పడేసుకున్నారు. పదిరూపాయల అప్పు యిచ్చి పల్లపు భూమిని క్లెయిం చేసుకున్నారు పల్లపు వ్యాపారులు!

ఆకు తెంపినా, కంప కొట్టినా కేసులు పెట్టి జరిమానాలతో జవజీవాల్ని లాగేసుకున్నారు ఫారెస్టోల్లు.

చెట్టూ పుట్టలూ, గెడ్డ గట్టులూ భూమికి హద్దులుగా మార్చేసి సవరోడికి ఆకాశాన్ని చూపించేరు రెవిన్యూవాళ్లు! పూటకో కేసుతో పోలీసువాళ్లు...?

అప్పుడుగదా... అడివంటుకుంది? అప్పుడుగదా... యీ భుజమ్మీదకి తుపాకొచ్చింది? భుజాలు తడుముకున్నాడు.. సోమన్నదొర! పగలూ, రాత్రులూ వేట! సోమన్న కోసం వేట! వేట కారణాన... గూడ పేరు మారింది. వేటగాళ్లు.. సోమన్న గూడగా నామకరణ చేస్సారు! ఇటికగూడ... సోమన్న గూడయ్యింది!

సోమన్నగూడ... ఎస్జీగూడ!!! నిట్టూర్చేడు సోమన్నదొర!

పీవోగారు ఎస్జీగూడ ఖాయం జేస్సారు! ఊట గెడ్డను ఫాల్స్ జేస్సారు!!

"మారండయ్యా... లోకంతో పాటూ," అని గూడలోని జనాల్ని మార్చే పనికి పూనుకున్నారు!

సోమన్న జైలు నుండి వచ్చిన తొలినాళ్లలో అంతగా మార్పేమీ కనబడలేదు. మెల్లమెల్లగా మార్పులేవో జరిగేవి. అవి తెలిసీసరికి మార్పులో మునిగిపోయీవోళ్లు గూడలో వాళ్లు!

"పల్లపు ఉప్పు, కిరసనాయిలూ, నూలుబట్టా, ఇప్పసారా... యివే... ఈటితోటే మనం అప్పుల పాలయిపోనాం! కరణం, నాయుడ్లూ, ఫారెస్టు గార్డులూ, రేంజిర్లూ, పోలీసు జెమాన్లూ, ఎస్సయిలూ... ఎగిరిన ఎర్రజెండాలు, ఊరేగింపులూ, తిరుగుబాట్లు... అడివి నెత్తుటి కళ్లమయిపోనాది! ఇపుడన్నిటికీ పల్లానికీ, పట్నానికి పరిగెడతన్నాం . పల్లమూ, పట్నమూ గూడకి వొచ్చీసినాయి. ఆఫీసులు.. అడివిలోకి వొచ్చీసేయి..! ఏయిపోతామో...?' సోమన్న మార్పులను చూసి ప్రశ్నించుకునేవాడు మనసులో!

సోమన్నగూడల యింతక మునుపు అందరూ యించూమించుగ సమానంగా వుండీవోరు. భూమీ, పుట్టా, ఆస్తీ, ఐశ్వర్యం, పిల్లాజెల్లా... అంతా అందరికీ ఒకేలాగ వుండేవి. సోషలిస్టు విలేజని హాస్యమాడీవోడు కామ్రేడ్! అప్పులూ... తలల మీద కొప్పులూ - సరిసమానంగ వున్నాయనీవోడు! అప్పుల సోషలిజం తెచ్చిపెట్టేడు షావుకారి... అనీవోడు.

మంగలి కత్తెర పట్టుకొని గడపల కూచొని తనని వెనక్కి తిరిగి కూచోమని తన పిలకజుత్తు కత్తిరిస్తూ కామ్రేడ్ పలికిన మాటలు గుర్తొచ్చేవి!

‘‘బీపి మీద నాటీ దెబ్బల మచ్చలూ మాయవూ... నువ్వా పారిటీ గ్యాపకాలూ మరవవు, తియ్యి...’’ అని విసుక్కుండేది సోమన్న చిన్నభార్య బొత్తి!

జైలుకి వెళ్లిన యేడాది అంటురోగంతో సోమన్న తొలి భార్య చనిపోయింది. సోమన్న తల్లి వుంది. కొడుకు రెంజిం బాల్యదశ దాటేడు. కూతురులు సుక్కి, బంతినీ ముసలి సాకుతూ వొచ్చింది. ఆమెకి సాయంగా యెదురింటి బొత్తి నిలబడింది. బొత్తి భర్త చనిపోయినాడు. యిద్దరు పిక్కిరోళ్లని పెట్టుకొని బతకతుండీది.

సోమన్న జైలు నుండి విడుదలయి వచ్చేక ప్రభుత్వం కొంత ఆర్థిక సాయాన్నీ, ఆ పర్వతాల మధ్యగా ప్రవహించే గెడ్డకు యెగువ యకరా భూమి పట్టానూ యిచ్చింది. ఆ భూమిని సాగుకి సాయం జేసేది బొత్తి! సోమన్న... బొత్తిని తన ఇంటికి రమ్మన్నాడు. గానీ బొత్తి తన పిల్లల్తోటి తన యింటిలోనే వుంటానని వుండిపోయింది. సోమన్నే ఆ యింటికి వెళ్లి వస్తుంటాడు. ఇపుడు బొత్తి ఆ ఇంటిలోనా లేదు. వల్లకాటిలో కాలి బూడిదయిపోయింది.

సోమన్న మనసులోపలి గ్యాపకాలను పక్కకు నెట్టేడు... వాహనం వచ్చి ఆగింది. వాహనంలోంచి ముగ్గురు దిగి, క్రికెట్ బేట్లూ, గ్లోవ్సూ, బంతులూ, కిట్ బేగులూ మోసుకు వస్తున్నారు. గూడలోని కుర్రాళ్లు గభాల్న ఎదురెళ్లి కిట్ బేగులు అందుకున్నారు.

‘‘రెండు బేచీలవ్వండి,’’ కుర్రాళ్లకు చెప్పేడు వాహనంలో వచ్చిన ఒకాయన!

కుర్రాళ్లు రెండు బేచీలయ్యేరు..!

‘‘పోటాపోటీగా ప్రాక్టీస్ చేయండి! నెగ్గడమే గోల్ మీ బేచ్‌లకు!! యిదిగో యితను రోజూ మీకు కోచింగిస్తాడ,’’ని ఒకాయన్ని చూపేడు.

ఆయన తెల్లటి బనియనూ, తెల్లటి ప్యాంటూ వేసుకున్నాడు, కండలు తిరిగిన ఒళ్లు. మనిషీ తెల్లగా అందంగా వున్నాడు. రెండు బేచ్ కుర్రాళ్లూ ఆయనకు నమస్కరించేరు.

కుర్రాళ్లే రెండు బేచీలయ్యేరా...? కాదు, గూడ రెండయ్యింది! ఔను, గూడ ఒకనాటి యేకశిల కాదు! రెండు పర్వతాలయిపోయింది! మధ్యలోంచి జలపాతం దూకుతోంది...! నిట్టూర్చేడు సోమన్న!

❖

ఊళ్లల్లో ఇళ్లు - చాలా కుటుంబాలు వలసలు పోయి, ముసిలీముతకల్తో, పనులకు చేయందని పిల్లల్తో పక్షులెగిరి వెళిపోయిన చెట్లలా వుంటాయి. గానీ రాజంపేట మాత్రం ఎక్కడెక్కడి పక్షుల్తోనో నిండిన కొమ్మల్లా వుంటుంది. అప్పటికీ నలుదిశలా కొమ్మల్లేచినట్టు బిల్డింగులు లేచినాయి.

అడవి పచ్చదనాన్నంతట్ని నింపుకున్న పీవో ఆఫీసు, పీవో బంగ్లా, సిబ్బంది క్వార్టర్లూ, కాగితాలమీద యెక్కువా, నేల మీద తక్కువా పనిచేసే ఇంజినీరింగ్ డిపార్టు మెంటూ, పల్లపు షావుకార్ని మరిపించే గిరిజన కార్పొరేషన్ ఆఫీసూ, కార్పొరేషన్ గొదామూ, సిబ్బంది గృహాలూ; గిరిజనేతరులకే ఆతిథ్యమిచ్చే అతిథిగృహాలూ, గూడ లోని ఇండ్లు నయమనిపించే ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళూ, స్కూళ్లూ... కేలండర్లలో కేష్ ఆశ చూపే బ్యాంకులూ, కండబలాన్నీ, కొండఫలాన్నీ కాజేసే దుకాణాలూ, ఆసు పత్రులూ, బ్రాందీ షాపులూ, సారాకొట్లూ, ఫైనాన్స్ కంపెనీలూ, నచ్చినపుడు నడిచే ఆర్టీసీ బస్సుల కాంప్లెక్సు, భూలోక నరక పోలీస్ స్టేషనూ, వారి క్వార్టర్లూ... యెన్నెన్నో కొమ్మలేచేయి... వృక్షపు మొదలు కనబడనట్టు!

పీవో ఆఫీసుకి రాజంపేట మెయిన్ రోడ్డు నుంచి కాకుండా లూప్ లైన్‌లో హీరోహోండాని మళ్లించేడు బుధడు!

"యిదేటి ? తిన్ననయిన తోవొదిలేసి... యిటెందుకు తిప్పేవ,"ని విసుక్కు న్నాడు సోమన్న.

"ఫైనాన్సోడికి కనబడిపోతాం! వాయిదాలు బాకీ," అన్నాడు బుధడు!

కిసుక్కున నవ్వేడు సోమన్న. బుధడికి వినబడింది గానీ పట్టించుకోలేదు.

సోమన్నే, "మీము సింతపండో, కందులో, ఇప్పపిక్కలో... యిలగే దారి తప్పిం చీసి సంతకి మోసుకెళ్లి వోళిమి. అప్పులిచ్చిన షావుకారినీ, తక్కువ దరకి పడీసికొనే కార్పొరేసనోళినీ తప్పించుకోడంకి," అనన్నాడు!

బుధడికి శౌర్యమొచ్చింది.

"మీ రోజులు కావులే... రోజులు మారిపోనాయి! భయపడి కాదు, యెందు కొట్టినే యెదురవ్వాల.. ఆడితో మాటలన్నించుకోవాల? మనమో మాట జవాబివ్వాల? ఆడేటి బండిని నాక్కోడు, మీకాడ సింతపండో, కందులో నాక్కున్నట్టగ! మాటలం టాడు.. మనకి పౌరుషం రాడానికి. పౌరుషానికి బండేన వొదిలేస్తాము లేపోతే తల తాకట్టెట్టయినా డబ్బు తెచ్చి ఆడి మొకాన కొట్టేస్తాము. ఆడి ఎగస్ట్రా కవుర్లన్నీట్నీ, వొడ్డీతోటి తిరగ అనేస్తాము. అదన్నమాట. అంత కతన్న మాట. ఏల సెప్మీ... అంత," అని సోమన్నకి జవాబు చెప్పినట్టు చెప్పేడుగానీ తన అంతరాత్మకు జవాబు చెప్పుకున్నాడు బుధడు!

"ఏటీ బండి పేరేటి?" అనడిగేడు సోమన్న.

చెప్పేడు బుధడు!

"ఇంతకీ యెవుళు హీరో? అప్పిచ్చినోడా? అప్పు పుచ్చుకున్నోడా?"

"ఎవుళూ కారు! నువ్వూ హీరోవి! పీవోనే కాళ్ల కాడకి రప్పించుకున్నావు గదా?" నిష్ఠురమాడేడు.

ఎస్.జీ. ఫాల్స్ బాగా క్లిక్ అయ్యింది. అప్పటికే ఆ రెండు కొండల్లోనూ, వాటికి దూరంగా వున్న మరో రెండు కొండల్లోనూ గ్రానేట్, బాక్సయిట్ యింకేవో ఖనిజాల కోసం కంపెనీలు అడుగుపెట్టేయి. ముందు ఆ కంపెనీలు కొండల మీది ఆదివాసీ గ్రామాలకు సరయిన రహదార్లు లేవని విచారించేయి. ప్రభుత్వానికి తమ విచారాన్ని వ్యక్తం చేసేయి. ప్రభుత్వం వెంటనే రహదార్లనేర్పాటు చేసింది. రహదార్ల మీద కంపెనీల లారీలూ, వాహనాలూ తిరుగాడుతున్నాయి. అతిథి గృహాలు చాలడం లేదు. మరికొన్ని రిసార్టులు లేచేయి. రాజంపేటలో రిక్రియేషన్ స్పాట్ లేదని పీవో గారు గ్రహించేరు. రిసార్టులకీ, ఫాల్స్‌కీ మధ్య భూమిని తీసుకొని రిక్రియేషన్ పార్క్ చేయాలనుకున్నారు. ఆ భూమి సోమన్నదొరది. దాంట్లో ఆయన కందులూ, చోలూ, నూలూ... వరీ వంటి పంటలు పండిస్తాడు.

అదిగో ఆ భూమిని అడగడానికి పీవో వచ్చేరు. వారానికోరోజు ఆఫీసులో దర్శనమిచ్చే పీవోయే నేరుగా తన యింటికి రావడంతో బుధడు తబ్బిబ్బయిపోయేడు. ఇంద్రుడు తనింటి కొచ్చినట్లుగా వుందతనికి! ఇంద్రుడే వస్తే కవచకుండలాలు లేవు గనక భూమో, పుట్టో అడిగి, పట్టుకుపోతాడనుకుంటున్నాడు సోమన్న!

ఔను...భూమే! "నీకెందుకూ..? దున్నుతావా..? పంటలు పండిత్తావా..?"

"భూమిని పంటకి తప్పా మరెందుకూ ఉపయోగించడం తెలీదు మీకు. భూమి వలన భూమంత లాభాలున్నాయి!"

"లాభమంటే...?"

పీవో వివరించేడు.

అడ్డంగా తలూపి, "నా నష్టమే నీ లాభం," అనన్నాడు సోమన్నదొర!

బుధడికి ఆందోళనగా వుంది.

"దున్నే వానికే భూమి.. అని పోరాడినాం. కేసులెట్టేరు, జెయిల్ల పెట్టేరు. కేసులన్నీ పోయిన తర్వాత విడుదలై వొచ్చేక జనజీవన స్రవంతిలో బతకమని అదిగో ఆ భూమిని యిచ్చేరు! ఇపుడు నువ్వు ఆ భూమిని యిమ్మంతన్నావు..! అదిచ్చీసి జనజీవన స్రవంతి నుంచి యెళిపోమనా..?" ప్రశ్నించేడు సోమన్న.

పీవోకి జవాబు దొరకలేదు. మిడతామిడతా చూస్తున్నాడు. అతనికి కాస్త దూరంగా అతని పర్సనల్ సెక్రటరీ లోలోపల సంతోషపడుతున్నాడు.

'పీవో అన్నీ వితండవాదం చేస్తాడు. అఫీషియల్ ప్రొసీజర్సుని తతంగమంటాడు. తను చెప్పినట్టుగా ప్రొసీడవమంటాడు. సిబ్బందిమి.. మీమవుతాము, పీపుల్... ఈళ్లెందుకవుతారు? అందులోకీ ట్రైబు... మళ్లా అందులోకీ మాజీ నక్సలైటూ...! కట్టిపోతంది మనోడికి...' అని మనసులో అనుకుంటూ ఆనందిస్తున్నాడు.

“ఎస్.జి. ఫాల్స్‌కి మంచి రెస్పాన్సు వస్తోంది. ఆ ఫాల్స్‌కి మీదుగా ఆ రెండు కొండలనూ కలుపుతూ ఒక రోప్ బ్రిడ్జి కడతాము,” అనన్నాడు పీవో.

“కట్టుకో..! మీమొద్దంతన్నామేటి... మళ్లా?”

“ఫాల్స్ దిగువ లేండునంతటినీ హేండోవర్ చేసుకొని డెవలప్ చేద్దామను కుంటున్నాము,” చెప్పేడు పీవో.

“దేన్ని డెవలప్ చేద్దుమనీ...?”

“ఎస్.జె. సరవుండింగ్స్...”

సోమన్న మౌనంగా తల వాల్చేడు.

సరవుండింగ్సంటే అర్థం కాలేదేమోనని తెలుగులో యేమంటారో పీఏని చెప్పమన్నాడు పీవో. సాధారణంగా యిటువంటపుడే పీఏలు స్వేచ్ఛ తీసుకొని తమ అభిప్రాయాలు చెప్తారు.

“అతగానికి తెలుస్సార్! ఇంగ్లీషులో ఉపన్యాసాల్ని బోధపరుచుకోగల్డు. మాజీ..నక్స...” అని చెప్పి చెవి గోక్కున్నాడు పీయే!

సరవుండింగ్సంటే పరిసరాలేనా? పరిసరాల్లోని మనుషులూ, జీవజాలాలున్నా?

పీవో తన ధోరణిలో తను, “ఫాల్స్ వాటర్ వృథాగా పోకుండా కిందన స్టోరేజ్ చేస్తాం. మినీ రిజర్వాయరన్నమాట!” అన్నాడు.

“వాటర్ వృథాగా యెక్కడ పోతంది? పొలాలకీ, గూడలకీ వాటర్...” అడ్డు తగిలేడు సోమన్న.

“పొలాలు తీసీసుకుంటుంది గదా ఐటీడీఏ ! ఇక గూడలకా...? కొళాయిల ద్వారా వాటర్ సప్లయ్ చేస్తాం!” అని రెండు ప్రశ్నలకూ జవాబు చెప్పేసి, “ఆ రిజర్వాయర్‌లో బోటింగ్‌యేర్పాటు చేస్తాం. రిజర్వాయర్ చుట్టూ పెద్ద పార్క్ కడతాం. రకరకాల పూలమొక్కలు... నర్సరీ పెడతాం. ఇంకోవేపు పిల్లలు ఆడుకోడానికి రకరకాల ఆట పరికరాలు యేర్పాటు చేస్తాం. విజిటర్స్ ఫుల్ సేటిస్ఫయి అవుతారు. విజిటర్స్ విపరీతంగా పెరుగుతారు,” పీవో... తన ఊహా దృశ్యాన్ని వర్ణించబోయేరు.

సోమన్న అడ్డు తగిలేడు. “మా గూడేనికీ ఆ ఊటగెడ్డకీ... అదేలెండి ఫాల్స్ మధ్య కంచె కడతారు. మా భూమ్మీద తిరుగాడ్డానికి మాకే టిక్కెట్టు పెడతారు... అంతేగదా?” అని ప్రశ్నించేడు.

చుట్టూ చేరిన జనాలు కిసుక్కున నవ్వేరు!

డెవలప్ చేద్దామని తను తపన పడుతుంటే దేవతల యగ్యానికి అడ్డుపడే రాక్షసుడిలా తనకు అడ్డుపడుతున్నాడని పీవోకి కోపమొస్తోంది. అసహనంతో మంచ మీ్మద అటూయిటూ కదిలి, యిక సోమన్నతో లాభం లేదని, బుధడితో సంప్రదింపులకు దిగేరు పీవో.

“మీ భూమికి కాంపెన్సేషనిప్పిస్తాను. నీకు ఆ ఎమ్యూజ్‌మెంట్ పార్కులో జాబు ఇస్తాను. మీ గూడలో అయిదారుగురికి యిందులో జాబ్ దొరుకుద్ది. రిజర్వాయర్‌లో బోట్ డ్రైవర్లు, పార్కులో టికెట్ బుకింగ్ క్లర్కులు! ఇక వచ్చేపోయే జనాలకు కావలసిన తినుబండారాలో, వస్తువులో దుకాణాలు మీరు పెట్టుకోవచ్చు. ఆలోచించు. మీ డెవలప్‌మెంట్‌కే. రేపు ఆఫీసుకి సోమన్నదొరని తీసుకు వచ్చి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు చేయించు. తర్వాత మీ డెవలప్‌మెంట్‌కి నాదీ పూచీ! నన్ను నమ్మండి!” అని చెప్పి వెళ్లిపోయేరు.

ఆ రాత్రి సోమన్న, బుధడూ గొడవపడ్డారు! కేకలేసుకున్నారు. చివరికి భూమిని ఐటీడీఏకి యివ్వకపోతే ఇల్లొదిలి వెళిపోతానన్నాడు బుధడు...!

❖

పీవోగారి గది చల్లగా వుంది. పీవోగారు ప్రశాంతంగా వున్నారు. బెల్ కొట్టి చల్లటి డ్రింక్స్ తెప్పించేరు. సోమన్న వొద్దన్నాడు.. డ్రింక్స్ యిష్టం లేదన్నాడు. పీవో నవ్వుతూ “జీలుగు కల్లూ..?” అని ప్రశ్నించేరు.

సోమన్న ఒప్పంద పత్రాలు తియ్యండన్నాడు. పీవో బెల్ కొట్టి... పీఏని రప్పించి, పత్రాలు తెప్పించేరు.

పత్రాలు పూర్తిగా చదివి బుధడి వేపోసారి, పీవో వేపోసారీ చూసి, కలం అడిగి తీసుకొని, ‘ఆరిక సోమన్నదొర వ్రాలు’ అని సంతకం పెట్టి పత్రాల్ని పీవోకి యిచ్చేడు. పీవో సంతృప్తిగా చూసుకొని మొత్తానికి సాధించేవని బుధడ్ని అభినందించేడు.

“లేండ్ వేల్యూ ప్రకారం మీకు రావలసిన డబ్బు ఫార్మాలిటీసన్నీ పూర్తయ్యేక బ్యాంకులో వేస్తాం. అక్కడ డెవలప్‌మెంట్ అయ్యేక నీకూ, మీ ఊరి కుర్రాళ్లు కొందరికీ జాబ్స్ డిపార్ట్‌మెంట్ రూల్స్ ప్రకారం ప్రయత్నిస్తాం... ఓకే...” అని చెప్పి పీవో సీట్లోంచి లేచేరు.

ఒక్క నిమిషం కూచోండని పీవోకి చెప్పి సోమన్నదొర తన లాల్చీ జేబులోంచి కాగితపు పొట్లాన్ని తీసి పీవో టేబుల్ మీద పెట్టి, “ఇది గూడా మీరు తీసుకోండి,” అనన్నాడు.

పీవో ఆశ్చర్యంగా యేమిటిదీ అననుకుంటూ కాగితపు పొట్లం విప్పేడు...

ఎర్ర అక్షరాల కరపత్రం, మధ్యలో ఎవరిదో ఫోటో! ఆ పోటో మీద చిటికెన వేలు... ఎర్రగా రక్తంతో తడిసి ఆరిపోయింది! భయపడ్డాడు పీవో.. భయంగా సోమన్నను చూసేడు. బుధడు కూడా నిశ్చేష్టుడయ్యేడు.

సోమన్న, “భయపడకండి. అది నా చిటికెన వేలే! ఆ చిటికెన వేలు పట్టుకొనే యిదిగో ఈడి తండ్రి రెంజిం చిన్నప్పుడు నా యెనక తిరుగాడేవాడు. పోడూ, అడివీ, కొండాకోనలూ నా యెనక నడిచీవోడు! నీనూ నా తండ్రి చిటికిన వేలు పట్టుకొని తిరుగాడీవోడిని! పెరిగి, పెద్దయీదాకా తండ్రి చిటికిన వేలే నడిపీది! నా తండ్రి చిటికిన

వేలు నాకు బతుకుతోవ సూపించిందిగానీ అదిగది సీకటి తోవ అయినపుడు నన్ను వెలుగుదారిలోకి పార్టీ నడిపింది. అదిగా దారీ...''

గొంతుకి కెళ్ల అడ్డమొచ్చింది. టేబుల్ మీది గ్లాసులో నీళ్లు గొంతులో పోసుకున్నాక, గొంతు సవరించి, ''దారే సరయింది కాదో, నేనే మళ్లిపోనానో నాకే తెల్దు! ఈడి బతుక్కి దారి మీరు చూపతన్నారు. 'అదిగది దారి కాదూ'... అని ఋజువు పరచాలేను, నీనొక దారీ చూపలేను. మీ దారిని నమ్మాలేను. మీరు మా ఊరిల ఒకలాగ మాటాడతారు. యిదిగీ కుర్చీల కూసున్నపుడింకొకలాగ మాటాడతారు. మీ మాటకీ, మీ రాతకీ తేడా వుంతాది. మిమ్మల్ని నడిపించీవోళు యేరేగా వుంతారు. చట్టమని మీరనుకుంతారు, రాజ్జెమని, నీననుకుంతాను!'' అని చెప్పబోయేడుగానీ ప్రయోజనం లేదని భావించి, చివరికి మళ్లీ గొంతు సవరించి, ''ఇల్లొదిలి పొమ్మం తావా? నా దారిల నన్ను నడవమంతావా... అనడిగేడు నా మనవడు! ఈ చిటికెన వేలు అవుసిరిం లేదిక! పాపం ఈడు పిక్కిరోడిగ వున్నపుడే ఈడి తండ్రి రెంజిం...'' మరి మాటాడలేకపోయేడు సోమన్నదొర.

ఏసీ పని చేస్తున్నా చెమటలు పట్టేయి పీవోకి. ఫ్యాన్ స్విచ్ వేశాడు. గాలి విసురుగా వీచింది. అకస్మాత్తుగా చిటికెన వేలు నుంచో, ఫోటో నుంచో ఎర్రగా రక్తం స్రవించసాగింది పీవో టేబుల్ నిండా...!

సోమన్నదొర వెనుదిరిగి, గది బయటకు అడుగులు వేసేడు!

*మనం ఆదివారం*
*1 జులై 2018*

✻



**అట్టాడ అప్పల్నాయుడు** 23 ఆగస్టు 1953న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. మొదటి కథ పువ్వుల కొరడా 1988లో సృజన మాసపత్రికలో అచ్చయ్యింది. దాదాపు వంద కథలు, ఐదు నవలలు, వ్యాసాలు, నాటకాలు రాశారు. సంపూర్ణ సాహిత్యం మూడు సంపుటాలుగా వెలువడింది. ఉత్తరాంధ్ర పత్రిక సంపాదకులు. *పోడు-పోరు, ప్రత్యామ్నాయం, ఒక పొట్టివాడు-కొందరు పొడుగువాళ్లు, బీల, క్షతగాత్ర గానం* కథాసంపుటాలు ప్రచురించారు.

*చిరునామా: **ప్లాట్ నెం. 203, మాయిల్లు అపార్ట్‌మెంట్స్, వంశధార నగర్, శ్రీకాకుళం-532001. ఫోన్: 94400 31961***
**attada.a@gmail.com**